


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 8-2-2025

సంపుటి: 20 సంచిక: 269
పేజీలు: 8 వెల: రూ.1




- నదీ గర్భాన్ని ఉమ్మడిగా తవ్వేస్తున్నారు
- బేరం ఎంతకు కుదిరిందో గాని పార్టీకి లొల్లి తప్పింది
- 2010 గ్రీన్ ట్రిబ్యునల్ చట్టానికి తూట్లు
- భైరిలోనూ బిల్లులు లేకుండా తరలింపు



# ఆ విధంగా సర్దుకుపోతున్నారు..!




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఒడిశాతో బోర్డర్ పంచుకుంటున్న ఒక నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని మొన్నటి వరకు గగ్గోలు పెట్టిన పార్టీ నాయకుడు, స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు ఇసుక తవ్వకాలపై సర్దుకుపోతున్నారు. దీంతో పార్టీకి తలనొప్పి వదిలినా నదీ గర్భాలు మాత్రం రోధిస్తున్నాయి. వంశధార నదిలో ఇసుక కోసం చేపట్టిన తవ్వకాలు ఏకంగా మట్టి పొరల వరకు వెళ్లిపోయాయి. ఇందుకు ప్రధానమైన కారణం అక్కడ ప్రజాప్రతినిధి, పార్టీ నాయకుడు సొంత వాహనాలను ఏర్పాటు చేసుకొని మరీ ఇసుకను తరలించుకుపోవడమే. విశాఖపట్నానికి చెందిన శ్రీనివాస్ పేరుతో ఒక సంస్థను తెర మీదకు తెచ్చి ఇసుక ర్యాంపుల్లో యథేచ్ఛగా

- మిగతా చివరి పేజీలో





• ఎడిటోరియల్

# తెల్లజాతే అతి పెద్ద వలసదారు

మత విద్వేషపూరిత సోకాల్డ్ దేశభక్తులు తప్ప దేశం పట్ల అభిమానం, గౌరవం వున్నవారెవరైనా అమెరికా 104 మంది భారతీయుల్ని యుద్ధఖైదీల్లా బంధించి చేతులకు బేడీలు, కాళ్లకు సంకెళ్లు వేసి, తమ యుద్ధ విమానాల్లో తరలించి, అమృత్‌సర్‌లో డిపోర్ట్ చేసి తిరిగి వెళ్లిపోవటాన్ని అంగీకరించలేరు. ఆ 104 మంది నిజానికి అమెరికాలో బతికిందీ లేదు. అక్కడ నేరాలు చేసినవారసలే కారు. గ్వాతిమాలా, మెక్సికో, పనామ వంటి దేశాల గుండా అత్యంత ప్రమాదకరమైన దారుల వెంట అమెరికాని చేరగానే, అరెస్ట్ చేసి తమ యుద్ధ విమానాల్లో కుక్కి భారత్‌లో డంప్ చేయించాడు ట్రంప్. ఈ మధ్య జరుగుతున్న పరిణామాల్ని చూస్తుంటే అతని పేరు 'డోనాల్డ్ డంప్' అని మార్చొచ్చనిపిస్తుంది. ఈ డోనాల్డ్ తెంపరి చవక ధరలకే తమ శారీరక శ్రమని అందించి ఆ దేశ ఆర్థిక వ్యవస్థకి తోడ్పాటు అందించిన విదేశీ వలసదారుల్ని 'ఏలియన్స్', 'క్రిమినల్స్' అని సంబోధిస్తున్నాడు. ఒక దేశానికి కచ్చితంగా తన దేశంలో అక్రమంగా నివసిస్తున్నవారిని తిరిగి వారి స్వదేశానికి పంపే హక్కు వుంటుంది. కానీ దానికో దౌత్యప్రక్రియ వుంటుంది. అలా తిరిగి పంపటాన్ని యుద్ధ ప్రక్రియగా మారిస్తే కచ్చితంగా అది అభ్యంతరకరమే. ఈ 104 మందినీ సంకెళ్లతో బంధీలు చేసి, యుద్ధ విమానాల్లో భారత్ గడ్డ మీద వదిలేయడం కచ్చితంగా యుద్ధ చర్యే. అంటే అమెరికాకి చెందిన ఒక మిలటరీ విమానం మన గడ్డ మీద దిగటం మన దేశ సార్వభౌమాధికారానికి భంగమే. ట్రంప్ ప్రభుత్వం ఇలా చేయబోతున్నట్లు మన ప్రభుత్వానికి ముందే తెలియచేసినా అలా చేయాల్సిన అవసరం లేదని, మనమే మన విమానాల్లో వారిని తెచ్చుకుంటామనీ మన ప్రభుత్వం అనలేదు. చిన్న చిన్న దేశాలు చూపించిన తెగువలో, ఆత్మగౌరవ ప్రకటనలో వందో వంతు ప్రతిఘటనైనా మన నుంచి లేదు. ఈ వలసదారులందరూ భారత్‌ని సక్రమంగానే వదిలారు కదా? వారు దేశాన్ని వదిలే ప్రక్రియలో అక్రమాలకు పాల్పడలేదు కదా? మరి వారిని మర్యాదగానే ఈ గడ్డ మీద దింపుకొనే బాధ్యత ప్రభుత్వానికి లేదా అనే ప్రశ్నలు అనివార్యంగా వస్తాయి. ఒక వ్యక్తికే కాదు ఒక దేశానికైనా ఆత్మగౌరవ రాహిత్యాన్ని మించిన దుర్గతి, దుస్థితీ మరొకటి లేదు. భారత్‌కి సంబంధించినంత వరకు ఈ దుర్గతి, దుస్థితి విదేశాంగ శాఖా మంత్రి జైశంకర్ పార్లమెంటు సాక్షిగా చేసిన ప్రకటనలో కనిపించింది. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇది చాలా మామూలు విషయమని, అమెరికా 2009 నుంచి ఇలా సంకెళ్లు వేసే పద్ధతిని అమల్లోకి తెచ్చిందనీ సెలవిచ్చాడాయన. అమెరికా అలా తన అహంకారపూరిత వైఖరిని ప్రదర్శిస్తే దానికి ఆమోద ముద్ర వేయటం తప్ప మరో గత్యంతరం లేదా? జైశంకర్ మాటల్లో కనీస విచారం లేదు. ఒక యజమాని చర్యని బానిస కళ్లప్పగించి చూసినట్లే వుంది. ఈయనకి 'మామూలు అంతర్జాతీయ వ్యవహారం'గా కనబడినది మరి కొలంబియా వంటి చిన్న ప్రాణ దేశాలకు ఎందుకు మామూలుగా కనబడలేదంటే వారి ఆత్మాభిమానం ధనోన్మాద, వర్ణోన్మాద ట్రంప్ కన్నా పెద్దది కనుక! పైగా భారతీయుల్ని సంకెళ్లు వేసి తీసుకురాలేదని, మీడియాలో చూపించినది గ్వాతిమాలా వలసదారులని మన ప్రభుత్వం బుకాయిస్తే, అదేం కాదు.. వారు భారత వలసదారులేనని అమెరిక ఆధారసహితంగా అధికారిక వీడియోని విడుదల చేసి గాలితీసింది. 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల ముందు మన ప్రధాని స్వయంగా అమెరికా వెళ్లి ట్రంప్ తరఫున దాదాపుగా ఎన్నికల ప్రచారం చేసినంత పనిచేశారు. ట్రంప్ తన ఆత్మీయ మిత్రుడు అని ప్రకటించారు. అంతకు ముందు కరోనా ఊపందుకుంటున్న సమయంలోనే 'నమస్తే ట్రంప్' పేరుతో ఇండియాలో అహ్మదాబాద్‌లో పెద్ద ప్రదర్శన నిర్వహించారు. అప్పుడు కూడా ట్రంప్‌ని మోడీ తన 'మిత్రుడు'గా పరిచయం చేశారు. కానీ అదే 'మిత్రుడు' కోవిడ్ సమయంలో ఔషధం భారత్ తమ దేశానికి పంపకపోతే ప్రతీకార చర్యలుంటాయని బెదిరించాడు. మన దేశం వెంటనే ఆ ఔషధం పంపింది. అసలు ట్రంప్‌తో మోడీకి కానీ, అమెరికాతో భారత్‌కి కానీ వున్న అనుబంధం ఏమిటి? మిత్రుల మధ్య స్నేహసంబంధమా? లేక యజమాని, బానిసల మధ్య సంబంధమా? వ్యక్తిగతపరంగా కానీ దేశపరంగా కానీ స్నేహమనేదే వుంటే సంప్రదింపులకి ఆస్కారం వుంటుంది కదా! ఎందుకు ఇంత వెన్నెముక లేకుండా వ్యవహరించాలి? అసలు వేరే దేశాలవారిని అక్రమ వలసదారులని అమెరికా అనడమే హాస్యాస్పదం. స్థానికి తెగల్ని మట్టుపెట్టి క్రమంగా ప్రస్తుత అమెరికాని పరిపాలిస్తున్న తెల్ల జాతే అతి పెద్ద వలసదారు. ఎన్ని దేశాల్లో అమెరికాకి మిలటరీ బేస్‌ల పేరుతో వలస క్యాంపులున్నాయి! ఎన్ని దేశాల్ని ఆక్రమించింది! ఎన్ని ప్రభుత్వాల్ని కూలదోసింది! మరొకరిని అక్రమ వలసదారులుగా పేర్కొనే నైతిక హక్కు ఆ దేశానికి లేదు. ప్రపంచం మొత్తానికి మారక ద్రవ్యంగా తన దేశ కరెన్సీ డాలర్‌ని కలిగివున్న అమెరికా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్ని ప్రభావితం చేస్తున్నప్పుడు ఆ దేశ కరెన్సీ మీద అన్ని దేశాల ప్రజలకూ ఆశ పుట్టడం, చీప్ లేబర్‌కి ఊతమిచ్చే పరిస్థితులు అమెరికాలో వుండటం.. ఇవన్నీ సక్రమమో, అక్రమమో వలసలకి దోహదం చేస్తుంది. వలసలు దేశాల మధ్య సమస్యగా భావించి దౌత్యపరంగా పరిష్కారాలకు ప్రయత్నించాలే తప్ప ట్రంప్ తన తెంపరితనంతో ఇలాగే ఓరల్ డయేరియాతో రంకెలేస్తూ, వీరంగంతో గంతులేస్తే ప్రయోజనం లేదు. ఎందుకంటే అమెరికా వంటి దేశాలకు వలసలు పోవడం వెళ్లేవారికి ఎంత అవసరమో, ఆ వలసదారుల అవసరమూ ఆ దేశాలకూ అంతే అవసరముంటుంది. ఎందుకంటే ఆర్థికంగా బలిసిన దేశాల ప్రజలు తమ 'సీట్ల'ను తక్కువ వేతనాలకి కదల్చరు మరి!



మనం చూసిన అతి పెద్ద విపత్తుల్లో కరోనా ఒకటైతే.. సునామీ మరొకటి. అలాంటి సునామీ నుంచి బతికి బట్టకట్టిన ఓ అమ్మాయికి.. నాటి సునామీ సమయంలో ఎందర్నో మృత్యుఒడి నుంచి తప్పించిన ఓ ఐఏఎస్ ఆఫీసర్ ఇటీవలే పెళ్లి జరిపించారు. పెళ్లి జరిగేవరకూ ఆ ఐఏఎస్ అధికారి దంపతులే ఆ అమ్మాయికి గాడ్ ఫాదర్, మదర్ గా నిల్చారు. ఆ కథ వినాలంటే ఓసారి నాగపట్నంలో నాటి సునామీ కాలం 2004కు వెళ్లిరావాలి. 2004 డిసెంబర్ 26న తమిళనాడులోని నాగపట్నం బీచ్ అల్లకల్లోలమైంది. నాడు సునామీ సృష్టించిన బీభత్సం ఏకంగా ఆరువేల మంది ప్రాణాల్ని బలిగొంది. ఆ సమయంలో నరకం అంచుల్లో యముడి చెర నుంచి ఎందరినో తరలించి కాపాడిన మృత్యుంజయుడయ్యాడు నాటి నాగపట్నం జిల్లా కలెక్టర్ జే. రాధాకృష్ణన్. అందులో మీనా ఒకరు.

# చావు అంచుల నుంచి..

# కొత్త జీవితాల్లోకి!!



## బాధితుల పాలిట గాడ్‌ఫాదర్ ఆ ఐఏఎస్!

నాగపట్నం జిల్లా కలెక్టర్‌గా వీలైనంత ఎక్కువమంది నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎందరికో ప్రాణభిక్ష పెట్టినవాడిగా రాధాకృష్ణన్ ఆ ప్రాంతవాసులకు ఓ దేవుడనుకున్నా.. లేక ఆ దేవుడు పంపిన దైవదూత అనుకున్నా.. లేక నిలువెత్తు మానవీయ రూపమనుకున్నా.. ఎవరి అభిప్రాయాల్ని బట్టి వాళ్లకలా కనబడే వ్యక్తి. అలా నాగపట్నం, తంజావూర్ రెండు జిల్లాల్లో సునామీ సమయంలోనూ.. ఆ తర్వాత కరాళనృత్యం చేసిన కరోనా సమయంలోనూ రాధాకృష్ణన్ సేవలు ప్రపంచవ్యాప్తంగా అప్లాజ్ అందుకున్నాయి.

ప్రస్తుతం రాధాకృష్ణన్ తమిళనాడు అదనపు ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేస్తున్నారు. 2004 సునామీ కాలాన నాగపట్నం కలెక్టరంటే.. ఇప్పటికే రెండు దశాబ్దాలు గడిచిపోయింది. ఆ చేదుఘటన ఎప్పుడూ వెంటాడేదే. కానీ, గుర్తుంచుకోవాల్సినంత గొప్పది కాదు. కానీ, ఆ చేదు జ్ఞాపకం మిగిల్చిన కన్నీటి అనుభవాలను చెరిపేసుకోలేదు. ఆ భీతిగొల్పిన ఘటన మిగిల్చిన విచారాన్నీ, విషాదాన్నీ మోస్తూ కాలం గడుపుతున్న వారిపట్ల మానవీయ కోణంలో ఆలోచించాడు రాధాకృష్ణన్. అదిగో అలాంటి కోణం లోనే తాజాగా ఆయన చేతుల మీదుగా పెళ్లి చేసిన మీనాలాంటివారెందరో కనిపిస్తారు.

మీనా ఒక ఉదాహరణ మాత్రమే. ఓ సౌమ్య, ఓ మీనా ఇలా ఎందరికో గాడ్ పేరెంట్స్ గా వారి బాగోగులు పట్టించుకున్న ఒక మానవతావాది రాధాకృష్ణన్.


నాగపట్నం మండలం కీచన్ కుప్పం అనే మత్స్యకార గ్రామశిథిలాల్లో గుట్టలుగా పడి ఉన్న శవాల మధ్య సజీవంగా కనిపించిన ఆడశిశువే మీనా. అలాంటివారందరి కోసం ప్రభుత్వంతో మాట్లాడి అన్నై సత్య అనే ఓ అనాథ శరణాలయాన్ని ఏర్పాటు చేశాడు. ఆ బాలల గృహం మీనాలాగే.. వేలంకన్ని బీచ్ ప్రాంతంలో సజీవంగా లభించి అక్కడికొచ్చి కొత్త జీవితాన్ని ప్రారంభించిన సౌమ్య వంటివారెందరికో ఓ గూడైంది. అభం శుభం ఎరుగని వయస్సులో బతుకు, చావంటే ఏంటో కూడా తెలియని పాలబుగ్గల పసిప్రాయంలో అన్నై సత్య శరణాలయమే వారికి సర్వస్వంగా మారితే రాధాకృష్ణన్, ఆయన భార్య కృతిక అక్కడివారందరికీ గాడ్ పేరెంట్స్ అయ్యారు.

తన ఉద్యోగ జీవితంలో పలు బదిలీలతో కొత్త ప్రాంతాలకు వెళ్తున్నా రాధాకృష్ణన్ దంపతులు మాత్రం మీనా, సౌమ్య బాగోగులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవారు. అప్పుడప్పుడు నేరుగా వచ్చి కలిసేవారు. వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు కావల్సిన చదువుల్లో ప్రోత్సహించారు. 2022లో సౌమ్యకు వివాహాన్ని జరిపించగా.. ఆమెకు గత ఏడాదే ఓ కూతురు పుట్టింది. ఇప్పుడు మీనా వివాహాన్ని కూడా ఐఏఎస్ అధికారి రాధాకృష్ణన్ దంపతులే తమ చేతుల మీదుగా ఘనంగా చేశారు. మొన్న ఫిబ్రవరి 2వ తేదీన ఆదివారం రోజున మీనా ఓ జాతీయబ్యాంకులో పనిచేస్తున్న పి. మణిమారన్‌ను పెళ్లి చేసుకుంది. శ్రీ నెల్లుక్కడై మరియమ్మన్ ఆలయం వారి విహానికి వేదికైంది. నాటి సునామీ సృష్టించిన బీభత్సంలో వేల మంది మృత్యువాత పడగా.. మీనాలాగే బతికి బట్టకట్టి అన్నై సత్య శరణాలయంలో ఆశ్రయం పొందిన తన ఈడువారందరితో మీనా పెళ్లిసందడి తమిళనాడులో ఓ ప్రత్యేక ఆకర్షణగా నిల్చింది.

ఈ కథ వింటుంటే ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక అనే పాటలోని ఆ లైన్ గుర్తొస్తుంది కదూ!

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో



'తండేల్' నిజంగా జరిగిన కథకు కొంచెం డ్రామా జోడించి తీసిన సినిమా. చందూ మొండేటి బృందం ఈ సినిమా తీయడానికి ప్రేరేపించిన అంశం.. పాకిస్థాన్ జలాల్లోకి వెళ్లిపోయి ఆ దేశంలో రెండేళ్లపాటు చిక్కుకుపోయిన శ్రీకాకుళం జాలర్ల బృందం ఎన్నో ప్రయత్నాల తర్వాత స్వస్థలానికి చేరడంలో ఉన్న డ్రామానే. వినడానికి చాలా ఎగ్జైటింగ్ గా అనిపించే విషయమిది. ఈ రియల్ ఎపిసోడ్ చుట్టూ ఓ ఊహాజనిత ప్రేమ కథను అల్లి సినిమాగా మలిచింది చిత్ర బృందం. ఐతే అందరి దృష్టినీ ఆకర్షించిన వాస్తవ కథ కంటే.. చందూ అండ్ టీం అల్లిన ప్రేమకథ ఇందులో హైలైట్ కావడమే ఆశ్చర్యం కలిగించే విషయం. తెలుగు తెరపై ఎన్నో ప్రేమకథలు చూశాం కానీ.. సముద్ర తీరంలో చేపలు పట్టుకుని బతికే కుటుంబాలకు చెందిన ఓ అబ్బాయి-అమ్మాయి మధ్య తీర్చిదిద్దిన ఈ లవ్ స్టోరీ ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుంది. ఎప్పుడూ చూసే ప్రేమ సన్నివేశాలే ఈ బ్యాక్ డ్రాప్ వల్ల భిన్నంగా అనిపిస్తాయి. పాటల్లో.. నేపథ్య సంగీ తంలో.. విజువల్స్ లో లవ్ ఫీల్ ఉప్పొంగుతుండగా.. లీడ్ పెయిర్ మధ్య చక్కటి కెమిస్ట్రీ కూడా వర్కవుటై 'తండేల్' ప్రేమకథ ప్రేక్షకులను అలరిస్తుంది. తాను చేసే వృత్తిని ఎంతో ఇష్టపడే హీరో.. ప్రమాదకరమైన ఆ వృత్తి వల్ల అతడికి ఏమవుతుందో అన్న భయంతో ఆ పనిని వదిలేయమనే హీరోయిన్.. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య సంఘర్షణతో డ్రామా రక్తి కడుతుంది. ఈ సంఘర్షణ ఇలా సాగుతుండగా.. హీరో పాకిస్థాన్లో చిక్కుకోవడంతో కథ మరింత రసకందాయంలో పడ్డట్లవుతుంది. పాకిస్థాన్ ఎపిసోడ్ ను కొంచెం సెన్సిబుల్ గా డీల్ చేసి ఉంటే.. 'తండేల్' స్థాయే వేరుగా ఉండేది. కానీ అక్కడ హీరోయిజం ఎలివేట్ చేయడానికి.. దేశభక్తి యాంగిల్ హైలైట్ చేయడానికి ప్రయత్నించడంతో 'తండేల్' రూటే మారిపోయింది.

# చూడదగ్గ ప్రేమకథ!

**కథనం-విశ్లేషణ:**

చూడ్డానికి చక్కగా అనిపించే ప్రేమ జంట.. నిజంగా వీళ్లిద్దరూ ప్రేమికులా అనిపించేలా వారి మధ్య పండిన కెమిస్ట్రీ.. మంచి ఫీల్ ఉన్న ప్రేమ సన్నివేశాలు.. మళ్లీ మళ్లీ వినాలనిపించే పాటలు.. అందమైన విజువల్స్.. ప్రేమికుల మధ్య బలమైన సంఘర్షణకు దారి తీసే ఒక సమస్య.. దాని చుట్టూ ఒక డ్రామా.. ఒక ప్రేమకథ పండడానికి ఇంతకంటే ఏం కావాలి? 'తండేల్'లో ఇవన్నీ ఉన్నాయి. 'తండేల్' గురించి చిత్ర బృందం చెప్పింది ఏదీ అతిశయోక్తి కాదని పించేలా సాగే ప్రథమార్ధం.. ఈ చిత్రాన్ని బెస్ట్ లవ్ స్టోరీల్లో ఒకటిగా నిలబెట్టడానికి బలమైన పునాది వేసేట్లే కనిపిస్తుంది. కానీ ఈ ప్రేమకథకు దేశభక్తి కోణం జోడించి దీని రీచ్ పెంచడానికి చేసిన ప్రయత్నం అందుకు ఉపయోగకపడకపోగా.. లవ్ స్టోరీలో ఉన్న ఫీల్‌ను కొంచెం దెబ్బ తీసి 'తండేల్' స్థాయిని తగ్గిస్తుంది. సినిమాలో హైలైట్ గా నిలుస్తుందని అనుకున్న పాకిస్థాన్ ఎపిసోడ్ అంచనాలకు తగ్గట్లుగా లేకపోవడం 'తండేల్'కు మైనస్. అయినా సరే.. దాన్ని మరిపించే ప్లస్సులు ఈ సినిమాలో ఉన్నాయి. అప్పటిదాకా ఎంతో సున్నితంగా.. వాస్తవికంగా సాగుతున్న కథన శైలిలో ఓవర్ ద టాప్ స్టయిల్లో సాగే పాకిస్థాన్ ఎపిసోడ్ ఇమడలేకపోయింది. ఇంటర్వెల్ నుంచి వేరే సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. అటు పాకిస్థాన్లో.. ఇక్కడ ఇండియాలో జరిగే విషయాలేవీ అంత ఎగ్జైటింగ్ గా అనిపించవు. పనిగట్టుకుని 'తండేల్'ను చెడగొడుతున్న ఫీల్ కలుగుతుంది. పాకిస్థాన్ ఎపిసోడ్‌ను డీల్ చేసిన తీరు చూస్తే.. మాస్‌కు నచ్చేలా సినిమా రీచ్ పెంచడానికి చేసిన ప్రయత్నంలా కనిపిస్తుంది. కానీ అది అంతగా వర్కవుట్ కాలేదు. పాకిస్థాన్ సమస్య రావడానికి ముందే హీరో హీరోయిన్ల మధ్య వచ్చే సంఘర్షణలో ఉన్న బలమైన ఎమోషన్.. ఎడబాటులో హీరో హీరోయిన్ల వేదనకు అద్దం పట్టేలా బలమైన ఎమోషనల్ సీన్లు లేకపోవడం ఇంకో మైనస్. అవతల సాయిపల్లవి లాంటి పెర్ఫామర్ ఉండగా.. మంచి ఎమోషనల్ సీన్లు పడి ఉంటే ప్రేక్షకుల గుండెలు బరువెక్కేవి. ఈ అవకాశాన్ని దర్శకుడు సరిగా ఉపయోగించుకోలేదు. ఐతే పాకిస్థాన్ ఎపిసోడ్ ముగింపు దశ నుంచి సినిమా మళ్లీ దారిలో వస్తుంది. ఐతే కొన్ని ప్రతికూలతలున్నప్పటికీ ప్రేమకథలను ఇష్టపడేవారికి 'తండేల్' మంచి ఛాయిసే. ఈ మధ్య వచ్చిన భిన్నమైన ప్రేమకథల్లో ఒకటిగా దీన్ని చెప్పొచ్చు. - తుపాకి.కామ్ సౌజన్యంతో...

**కథ:**

రాజు (నాగచైతన్య) శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన కుర్రాడు. సముద్రంలో చేపల వేటకు వెళ్లడం అతడి కుటుంబానికి తరతరాలుగా వస్తున్న వృత్తి. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ అతనూ అదే పని చేస్తాడు. ఈ క్రమంలో జాలరుల బృందానికి నాయకుడైన తండేల్ అవుతాడు. అతడికి సత్య (సాయిపల్లవి) అంటే ప్రాణం. ఆమెకూ అతనంటే అంతే ఇష్టం. కానీ సముద్రంలో వేటకు వెళ్లే వాళ్ల ప్రాణాలకు గ్యారెంటీ లేని పరిస్థితుల్లో రాజును ఆ పని మానేయమని అడుగుతుంది సత్య. కానీ అందుకతను ఒప్పుకోడు. ఓ సందర్భంలో సత్య ఎంత పట్టుబట్టినా వినకుండా వేటకు వెళ్తాడు. ఈ క్రమంలో అతను.. తన బృందం పాకిస్థాన్ అధికారులకు చిక్కుతారు. మరి అక్కడి నుంచి రాజు బృందం తప్పించుకుందా లేదా.. అతణ్ని బయటికి తీసుకురావడానికి జరిగిన ప్రయత్నాలేంటి.. చివరికి రాజు-సత్య కలిశారా లేదా అన్నది మిగతా కథ.

**నటీనటులు:**

అనుకున్నట్లే 'తండేల్'కు నాగచైతన్య-సాయిపల్లవి జోడీ ప్రధాన ఆకర్షణగా మారింది. ఇద్దరిలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనలేం. వీళ్లిద్దరినీ విడి విడిగా కూడా చూడలేం. అంత బాగా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ పండింది. చైతూ జాలరిగా మేకోవర్ అయిన తీరు చాలా బాగుంది. కేవలం అవతారం మార్చుకోవడమే కాదు.. బాడీ లాంగ్వేజ్.. యాస.. అన్నింట్లోనూ మార్పు చూపించాడు. ఎక్కడా ఓవర్ ద బోర్డ్ వెళ్లకుండా కొలిచినట్లు నటించాడు. సాయిపల్లవి గురించి చెప్పేదేముంది.. ఆమె ప్రేమిస్తుంటే పులకింతకు గురవుతాం. బాధ పడుతుంటే.. కదిలిపోతాం. తన భావోద్వేగాలన్నింటినీ ప్రేక్షకులు ఫీలయ్యేలా చేయగలిగింది. పాత్ర తాలూకు మానసిక సంఘ ర్షణను హావభావాలతో చూపించిన తీరు అద్భుతం. కానీ ద్వితీయార్ధం లో ఆ పాత్ర నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తాం. సినిమాలో కీలక పాత్రల్లో నటించిన తమిళ ఆర్టిస్టులు ఆడుగలం నరేన్.. కరుణాకరన్ బాగా చేశారు. పృథ్వీ కూడా ఓకే. 'మంగళవారం' ఫేమ్ దివ్య పిళ్లై కూడా ఆకట్టుకుంది. జబర్దస్త్ మహేష్.. మిగతా ఆర్టిస్టులు కూడా బాగా చేశారు.

**సాంకేతిక వర్గం:** దేవిశ్రీ ప్రసాద్ చాన్నాళ్ల తర్వాత సంగీత దర్శకుడిగా వంద శాతం ఔట్ పుట్ ఇచ్చిన సినిమాగా 'తండేల్'ను చెప్పొచ్చు. ఈ కథ విని అతను చాలా ఎగ్జైట్ చేసిన పాటల్లాగా అనిపిస్తాయి 'బుజ్జితల్లీ'.. 'హైలెస్సో'.. ఈ రెండు పాటల చిత్రీకరణ కూడా చాలా బాగుంది. ఈ పాటల థీమ్స్ ను బ్యాగ్రౌండ్ స్కోర్ కోసం కూడా వాడుకుని ప్రేమ సన్నివేశాల్లో మంచి ఫీల్ తీసుకొచ్చాడు దేవి. పాటలు.. నేపథ్య సంగీతం విషయంలో వేలెత్తి చూపడానికి లేదు. శ్యామ్ దత్ ఛాయాగ్రహణం కూడా చాలా బాగుంది. ఆర్ట్ వర్క్.. వీఎఫెక్స్ కూడా ఓకే. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. సినిమా చాలా రిచ్ గా తెరకెక్కింది. కార్తీక్ అందించిన కథలో బలం ఉంది. దానికి చందూ మొండేటి ఆసక్తికరమైన స్క్రీన్ ప్లే రాసుకున్నాడు. శ్రీకాకుళం నేపథ్యంలో అథెంటిగ్గా ఈ కథను నరేట్ చేశాడు. యాస దగ్గర్నుంచి అన్ని విషయాల్లో శ్రద్ధ పెట్టిన విషయం తెరపై కనిపిస్తుంది. చైతూ-సాయిపల్లవి జంట నుంచి చందూ బెస్ట్ ఔట్ పుట్ రాబట్టుకున్నాడు. వాళ్లిద్దరి మధ్య ప్రేమ సన్నివేశాలా చాలా బాగా డీల్ చేశాడు. ఒక్క పాకిస్థాన్ ఎపిసోడ్ విషయంలో మాత్రం అతను డిఫరెంట్ అప్రోచ్ తో వెళ్లాల్సిందనిపిస్తుంది. ద్వితీయార్థం మీద ఇంకొంచెం శ్రద్ధ పెట్టి ఉంటే.. 'తండేల్' వేరే స్థాయి సినిమా అయ్యేది.

# పిచ్చి కుక్క కాదు..!

**'ఏమిటండీ ఈయన? ఏదో ఆవేశం కాకపోతే? మిలిటరీ విమానాలను ఉపయోగించి మరీ అక్రమ వలసదారులు పంపించేస్తున్నాడు. మిలటరీ విమానం బాగా కాస్ట్‌లీ. ఒక్కో ప్రయాణికుడిపై సివిల్ విమానంలో ఫస్ట్‌క్లాస్ టికెట్ కంటే మూడు రెట్లు ఖర్చవుతుంది. ఆ దేశంలో మొత్తం కోటిమంది అక్రమ వలసదారులు ఉన్నట్టు వారే చెబుతున్నారు. ఇలా 100 మందిని, 200 మందిని పంపాలంటే అది ఎప్పటికయ్యేను? అమెరికా బడ్జెట్ అంతా ఖర్చు పెట్టినా మరో పదేళ్లకు కూడా అక్రమ వలసదారులు పంపించలేరు. 'ఇండియన్ స్టూడెంట్స్ పనిచెయ్యడం వల్లే రెస్టారెంట్లు, గ్యాస్ స్టేషన్స్, మాల్స్ నడుస్తున్నాయి. రూల్స్‌ను కచ్చితంగా అమలుచేస్తే అవి మూతబడతాయి. అప్పుడు రెస్టారెంట్లు, గ్యాస్ స్టేషన్స్, ఓనర్స్ నుంచి వ్యతిరేకత వస్తుంది. మరో మూడు నెలల్లో ట్రంప్ తగ్గాల్సిందే. గెలిచిన ఆవేశంలో ఏదో చేసేస్తున్నాడు. కాస్త ఓపిక పడితే అన్నీ సర్దుకుంటుంది..'** ఇదీ గత రెండు వారాలుగా అనేక మంది విశ్లేషకులు చెబుతున్న మాటలు.

ఎందుకింత ఆవేశం? అది ఆవేశమా? లేక ఆలోచనా? ఓపికగా చదవండి. వెన్నులో వణుకు పుడితే నన్ను తిట్టుకోవద్దు. ఇలా జరగాలని నేను కోరుకోవడం లేదు. జరక్కపోతే సంతోషపడేవారిలో నేను మొదటివాడిని. ఈ కథనం సేవ్ చేసుకోండి. ఆరు నెలల తర్వాత ఇంకోసారి చదవండి. కృత్రిమ మేధ యుగంలో 70 శాతం ఉద్యోగాలను రోబోలు ఎత్తుకెళ్లిపోతాయి. రోబోలతో పని చేయించేవారికి, రోబోలు చేయలేని పని చేసేవారికే ఇక ఉద్యోగాలు. ఈ మాట గత కొన్నేళ్లుగా తరచూ వినిపిస్తోంది. ఇదిగో మొదలయిపోయింది. ఎక్కడ మొదలు కాకూడదో అక్కడే మొదలయ్యింది. ట్రంప్‌ది ఆవేశం కాదు.. ఎన్నికలకు ముందే ఏమి చెయ్యాలో చాలా ప్లాన్స్ వేసుకొని వచ్చాడు. మాగా అంటే మాక్ అమెరికా గ్రేట్ అగైన్ అని. తిరిగి అమెరికాను గొప్ప దేశం చెయ్యాలి అనేది ట్రంప్ బృందం ఆలోచన. అమెరికా విప్లవం జరిగి 250 ఏళ్లు అయ్యింది. ఇప్పుడు అమెరికాలో రెండవ విప్లవం తేవాలని పకడ్బందీ ప్రణాళికతో ట్రూప్ బృందం శరవేగంతో ముందుకు ఉరకలేస్తోంది. ట్రంప్ ప్రవేశ పెట్టిన వాటిలో ముఖ్యమైనవి.. డాగీ వీఎస్ఐపీ.

**ముందుగా డాగీ గురించి..**

అమెరికా ఫెడరల్ వ్యవస్థ.. మీకు బాగా అర్థం కావడానికి ఫెడరల్ అనే మాట స్థానంలో సెంట్రల్ అని వాడుతాను. అమెరికాలో సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగుల సంఖ్య 30 లక్షలు. ఇందులో ఫుల్ టైం ఉద్యోగులు 23 లక్షలు. 10 మంది మనుషులు చేసే పనిని ఒక్క రోబో చెయ్యగలదు. అమెరికా సెంట్రల్ గవర్నమెంట్ వ్యవస్థలో రోబోలు ప్రవేశపెడుతున్నారు. అందుకే డాగీకి ఎలోన్ మస్క్ నాయకత్వం వహిస్తున్నాడు. ప్రభుత్వ వ్యవస్థల పనితీరు మెరుగుపరచడం, ఇలా ఎన్ని మాటలు చెప్పినా దాని సారం రోబోలను ప్రవేశపెట్టడమే. అందుకే ట్రంప్ వీఎస్ఐపీ అనే పథకం ప్రవేశపెట్టాడు. ఉద్యోగాలు వదిలేసిపోతే ఎనిమిది నెలల జీతం ఇస్తానని చెప్పాడు. సుమారుగా ఒకటి నుంచి రెండు లక్షల మంది అమెరికా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకాన్ని ఉపయోగించుకొని స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందుతారని వారి అంచనా. అమెరికాలో సగం దాక ఎర్ర రాష్ట్రాలు. అంటే కమ్యూనిస్ట్ రాష్ట్రాలు కావు. ట్రంప్ పార్టీ.. అదే రిపబ్లికన్ పార్టీ అధికారంలో ఉండే అనేక రాష్ట్రాలు డాగీ లాంటి పథకాన్ని తమ రాష్ట్రంలో కూడా అమలు చెయ్యడానికి పథకాలు వేస్తున్నాయి. ఒక్లోహోమా, టెక్సాస్, కరోలినా, న్యూ హాంప్షైర్, మిస్సోరి.. ఇలా ఒక్కొక్కటి ముందుకు వస్తున్నాయి. అంటే మరో ఆరు నెలల్లో అమెరికాలో సెంట్రల్, స్టేట్ గవర్నమెంట్ ఉద్యోగులు పెద్ద ఎత్తున వాలంటరీ రిటైర్మెంట్ తీసుకొంటారు. వీరి సంఖ్య 5లక్షల దాక ఉండొచ్చు. అమెరికాలో ఇప్పటికే ఉన్న నిరుద్యోగ యువత సంఖ్య 23 లక్షలు. అంటే సుమారు 30 లక్షల మంది ప్రైవేట్ ఉద్యోగాలకోసం చూస్తారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారిలో కొంతమంది కొత్త ఉద్యోగం కోసం చూడకపోవచ్చు. నిజమే. 30 లక్షల మంది.. అందరూ అమెరికా పౌరులు. వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. ఎలా? స్టూడెంట్ వీసాపై వెళ్లి పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకొంటున్నవారు లక్షల్లో వున్నారు. అలాగే వీసా నిబంధనలు అతిక్రమించి ఉన్నవారు పెద్ద సంఖ్యలో. చట్టాన్ని అమలు చేస్తే ఈ ఉద్యోగాలు పౌరులకు దక్కుతాయి.

ఇది కేవలం ప్రారంభం మాత్రమే.. ఏదో అద్భుతం జరిగి డాగీ ప్రక్రియ ఆగిపోతే తప్పించి.. 1. లక్షల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు ఊడుతాయి, లేదా ఖాళీ అవుతాయి. వీరు అమెరికాలో దొరికే ప్రైవేట్ ఫుల్ టైం లేదా పార్ట్ టైం జాబ్స్ కోసం చూస్తారు. 2. ఉద్యోగుల సంఖ్య తగ్గించుకోవడం వల్ల ప్రభుత్వానికి కోట్లలో ఆదా అవుతుంది. ప్రభుత్వ వ్యవస్థల పని తీరు మెరుగుపడుతుంది. 3. అమెరికన్స్‌కే జాబ్ లేనప్పుడు అక్కడికి వెళ్లినవారు (గ్రీన్‌కార్డు వారు తప్పించి.. అలాగే కీలకమైన ఉద్యోగాల్లో ఉన్నవారు తప్పించి) ఏమి ఉద్యోగాలు చేస్తారు? ఇప్పుడు ట్రంప్ యుద్ధ విమానాల్లో దించుతున్నాడు అంటే 'అరేయ్.. బాబు వెళ్లిపోండి' అని చెప్పడం. ఉద్యోగాలు పోతే.. అమెరికాలో ఎన్ని రోజులు ఉంటారు? చట్టాలను కచ్చితంగా అమలు చేస్తే ఎంతమంది అక్కడ వుండే అర్హతను కోల్పోతారు? వీరు ఎంత కాలం అమెరికాలో ఉండగలుగుతారు?

యుద్ధ విమానాలు, కాళ్లకు చేతులకు సంకెళ్ళు, ఇవన్నీ సంకేతాలు. చట్టం అమలు చేస్తామని అందరికీ చెప్పడం. అక్కడ వుండే అర్హత కోల్పోయినవారు సొంత డబ్బులతో తిరిగి తమ దేశాలకు వెళ్లిపోవాల్సిందే. అంటే పొమ్మనకుండా పొగ పెట్టడం. ఇది ఒకే రోజులో జరగదు. ప్రక్రియ ప్రారంభం అయింది. నిన్న జరిగింది గోరంత, జరగబొయ్యేది కొండంత. అని రాసాను. ఇదే అసలు విషయం. 4. రోబోలు ప్రవేశపెడితే కొత్త ఉద్యోగాలు రావా? వస్తాయి. వంద ఉద్యోగాలు ఊడితే.. ఇరవై ముప్పై కొత్తగా వస్తాయి. కృత్రిమ మేధ, రోబోటిక్స్ లాంటి కొత్త రంగాల్లో వస్తాయి. మొత్తం వీసా విధానాన్ని మార్చేసి కేవలం అత్యుత్తమ ప్రతిభ కలిగిన వారిని మాత్రమే అమెరికాకు రప్పించేలా/ అమెరికాలో ఉండేలా చేయబోతున్నారు. ఇలాంటి వారికి విమానం ఎక్కేముందే గ్రీన్‌కార్డు ఇస్తారు కాబోలు. ఇప్పటికే అక్కడ వున్నవారికి గ్రీన్‌కార్డులు ఇచ్చేస్తారు. క్యారెట్ అండ్ స్టిక్ పాలసీ అన్నమాట. ప్రతిభ లేకున్నా.. ఉన్నత విద్య పేరుతో అమెరికాకి వెళ్లిపోవడం, పార్ట్ టైం ఉద్యోగం, ఫుల్ టైం ఉద్యోగం, అటుపై అక్కడే సెటిల్ అయ్యిపోవడం.. ఇక గతం. గడియారం వెనక్కు తిరుగుతోంది.. 1960, 1970లలో ఉన్నట్టే కేవలం అత్యుత్తమ ప్రతిభ కలిగినవారికే ఇక అమెరికా ఛాన్స్. డెమొక్రాటిక్ పార్టీ ఎన్ని నిరసనలు చేసినా ప్రయోజనం ఉంటుందా? మహా అంటే.. వేగాన్ని తగ్గించవచ్చు. అర్థం అయ్యిందా.

పిచ్చి కుక్క కాదు.. భవిషత్తు! ఆగండి.. అక్కడితో అయిపోలేదు. డాగీ లాంటిది అటుపై ఇండియాలో రాదా? మిగిలిన డబ్బుతో బంగారం కొనుక్కోండి. ఖర్చు తగ్గించుకొని ఆదాచేసుకోండి. పిల్లలని కృత్రిమ మేధ రోబోటిక్స్ లాంటి కోర్సులలో చేర్పించండి. అన్నింటికీ మించి రోబో చెయ్యలేని పని వారు చేసేలా చెయ్యండి. సృజన, క్రిటికల్ థింకింగ్, కాంప్లెక్స్ ప్రాబ్లెమ్ సొల్వింగ్ స్కిల్స్ వారిలో తీసుకు రండి అంటూ... సొంత ఖర్చుతో ఊరూరా బాల మిత్ర క్లాసులు పెట్టి ఎందుకు చెబుతున్నానో అర్థం అయ్యిందా..?

**- వాసిరెడ్డి అమర్నాథ్**

# ఆ విధంగా సర్దుకుపోతున్నారు..!

**మొదటిపేజీ తరువాయి**

తవ్వేస్తున్నారు. గతంలో నివగాం రీచ్‌పై ఈ ఇరువురు నాయకులు పెత్తనం కోసం రోడ్డెక్కారు. ఆ తర్వాత ఓ అవగాహనకు రావడంతో పోటాపోటీగా ఇసుకను తవ్వుకు పోతున్నారు. ప్రజాప్రతినిధి తన సొంత అవసరాల కోసమంటూ కొన్ని టిప్పర్లను ప్రతీరోజు రీచ్ వద్దకు పంపించి, వాటిని బయట మార్కెట్‌లో అమ్ముకుంటున్నారన్న విమర్శలున్నాయి. నియోజకవర్గంలో ఉపాధి నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనుల కోసం ఈ ఇసుకను తరలించి సొమ్ములు చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇందుకోసం నదిలో ఏకంగా ఓ ప్రొక్లయినర్‌ను పర్మినెంట్‌గా ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే రీచ్ వద్ద మైనింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నా ఎక్కడా అడ్డుకోవడం లేదంటే కారణం ఇందులో పెద్దలు ఉండటమేనని వేరేగా చెప్పనక్కర్లేదు. అలాగే రెవెన్యూ అధికారులు కూడా అక్రమ తవ్వకాలపై నోరెత్తడం లేదు. ఇసుక రీచ్‌లతో ఈ ఇద్దరు నేతలు ఇప్పుడు సత్సంబంధాలు ఏర్పాటు చేసుకొని సర్దుకుపోతున్నారు.

కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద అక్రమంగా ఇసుకను తవ్వుతున్నారని గొడవ చేసిన పార్టీ నాయకుడు ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారంటే అందుకు కారణం ఆయన రీచ్‌లు వేరేగా ఉన్నాయని చెబుతున్నారు. గతంలో కేవలం ప్రజాప్రతినిధి తవ్వుకుపోతున్నారని మీడియాను, మైనింగ్ శాఖను రోడ్డెక్కించి నాలుగు రోజుల పాటు రీచ్ నడవకుండా ఆపిన నాయకుడు ఇప్పుడు సైలెంట్‌గా ఉన్నారంటే ఇసుక వ్యాపారం ఆగిందని కాదు.. ఎక్కడో బేరం కుదిరిందని. గతంలో కూడా ఆకులతంపర వద్ద డీషిల్టేషన్ పనుల కోసం వద్ద స్కై ఇన్‌ఫ్రా సంస్థతో వాటాలు కుదరకే రోడ్డెక్కారని, ఆ తర్వాత పార్టీ నాయకుడు, ప్రజాప్రతినిధి కలిసి కూర్చుని మాట్లాడుకొని వాటాలు తేలిన తర్వాత మళ్లీ ఇదే ర్యాంపు వద్ద ఇసుక దోపిడీ ప్రారంభమైంది.

కొత్తూరు మండలంలో ఇసుక ర్యాంపుల్లో సహజ వనరులు దోపిడి యథేచ్ఛగా సాగుతున్నా మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. రేయింబవళ్లు తేడా లేకుండా ఇసుకను నది గర్భంలోనే ప్రొక్లెయినర్లతో లారీల్లోకి లోడ్ చేసి తరలించుకుపోతున్నారు. భారీ వాహనాలు నదీగర్భంలోకి వెళ్లేందుకు వీలుగా నదుల్లో బాటలు వేశారు. బాటలు వేసిన స్థానిక టీడీపీ నాయకులు లోడింగ్ కోసం వచ్చే వాహనాల నుంచి రూ.200 వసూలు చేస్తున్నారు. వీటిలో కొంత మొత్తం స్థానిక ప్రజాప్రతినిధి వాటాగా తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. మైనింగ్ శాఖ అధికారుల దగ్గరుండి నదీ గర్భంలోకి ప్రొక్లయినర్లతో ఇసుకను తవ్వి లారీల్లోకి లోడ్ చేయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. 2010 గ్రీన్ ట్రిబ్యునల్ చట్టానికి తూట్లు పొడిచి పరిమితికి మించి ఇసుకను తవ్వి తరలించుకుపోతున్నారు.

ఇదే రీతిన శ్రీకాకుళం మండలం పరిధి భైరిలో ఇసుక తవ్వకాలకు అనుమతి తీసుకొని అక్రమంగా తరలించుకుపోతున్నారు. భైరిలో ఇసుక తవ్వకాలకు పీఎస్ఎన్ రెడ్డి అండ్ కో, శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్ అండ్ మైనింగ్ కార్పోరేషన్ ప్రభుత్వం అనుమతిచ్చింది. వీరికి స్థానిక టీడీపీ నాయకులు అండదండలు అందిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. ఇసుక రీచ్‌కు అనుమతిచ్చే ముందు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో స్థానికుల నుంచి సంతకాలు సేకరించారు. రీచ్ నిర్వహించడానికి గతంలో అడ్డుచెప్పిన టీడీపీలో ఒక వర్గం సంతకాలు సేకరించిన సమయంలో గమ్మున ఉండిపోయింది. సంతకాలు సేకరించే సమయంలో గ్రామంలో ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేసుకొనే అవకాశం ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. దీనికి సరేనంటూ అధికారులు హామీ ఇచ్చారు. గ్రామంలో కూలీలకు ఇసుక రీచ్ వద్ద ఇసుకను లోడ్ చేసే అవకాశం కల్పించాలని కోరారు. దీనికి అధికారులు అంగీకరించారు. రీచ్ ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా గ్రామంలో ట్రాక్టర్లకు లోడ్ చేసుకోవడానికి అనుమతించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో కూలీలకు రీచ్‌లో ఇసుకను వాహనాలకు లోడ్ చేసే అవకాశం ఇవ్వడం లేదని చెబుతున్నారు. నదీ గర్భంలో భారీ యంత్రాలతో ఇసుకను తవ్వి లారీల్లో అనధికారికంగా ఇసుకను విశాఖకు తరలించుకుపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. స్థానిక టీడీపీ నాయకులు కనుసన్నల్లో సాగుతున్న ఈ దందా వల్ల ఉపాధి అవకాశాలు కోల్పోయినట్టు స్థానికులు చెబుతున్నారు. రీచ్‌లో విశాఖకు ఇసుకను తరలించే 14 టైర్ల లారీలకు రూ.7,700 వసూలుచేసి రసీదు ఇవ్వకుండా పంపిస్తున్నారని లారీ యజమానులు చెబుతున్నారు. లారీలు సామర్థ్యాన్ని బట్టీ డబ్బులు వసూలుచేసి జేబులు నింపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లారీల్లో ఓవర్ లోడ్ చేడానికి ఒక ధరను నిర్ణయించి తీసుకుంటున్నారు. లారీల్లో పరిమితికి మించి ఇసుకను లోడ్ చేసుకొని వెళుతున్నా రవాణా, పోలీసు శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని రీచ్‌ల్లో ఇదే దందా నడుస్తున్నా రాజకీయ నాయకులు ఒత్తిడి వల్ల మైనింగ్ అధికారులు చేతులు కట్టుకొని కూర్చున్నారు.

# ఘనంగా ప్రారంభమైన 101వ త్రయాహ మహోత్సవాలు



**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

భీష్మఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ధర్మవరం శ్రీరామ మందిరంలో 72 గంటల పాటు 101వ త్రయాహ మహోత్సవాలు అఖండ హరినామ సంకీర్తన నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 6.30 గంటలకు మొదలైన ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం 6.30 గంటల వరకు శ్రీరామలింగేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో జరుగుతుంది. హిందూ ధర్మ పరిరక్షణ, సనాతన ధర్మ పునరుద్దీపనం కోసం భజన సంస్కృతిని మరో తరానికి అందించడానికి శ్రీరామలింగేశ్వర భజన బృందం నిర్విరామంగా కృషి చేస్తోంది. శనివారం శ్రీరామలింగేశ్వర భజన బృందంతో పాటు తండ్యాంవలస శ్రీ వేంకటేశ్వర భక్తి స్వరాంజలి, పాత్రునివలస శ్రీ సీతారామ భజన బృందం, పాత పొన్నాడ శ్రీ భద్రకాళి భజన బృందం పాల్గొంటున్నాయి. అలాగే ఆదివారం హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ సత్యసాయి భజన బృందం, చాపురం శ్రీ భారతి భక్తిస్వర కళాంజలి బృందం, ఎ.జి.ఎన్.పేట శ్రీ సీతారామ భజన బృందం, నరసన్నపేట మండలం బసివలస శ్రీ వేంకటేశ్వర భజన మండలి, సోమవారం కొయ్యాం శ్రీరామ భజనబృందం, గోరవానిపేట శ్రీరామ భజన బృందం, పాత్రునివలస శ్రీ ఉమానీలకంఠేశ్వర భజన బృందం, చిన్నకొంగరాం శ్రీ సీతారామ బాలభక్త భజన బృందం ఈ కార్యక్రమంలో పాల్గొనున్నాయి. వీరితో పాటు శ్రీ హరేరామ భజన బృందం, శ్రీ శ్రీనివాస భజన బృందం, శ్రీ ఓం నమఃశివాయ భజన బృందం, సర్వదేవతా భజన బృందం, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు పాల్గొనున్నారు. ధర్మవరపు సోములు ఆధ్వర్యంలో హార్మోనియంపై జి.సత్యారావు, బి.కృష్ణారావు, కె.అసిరినాయుడు, డోలక్‌పై బి.భాస్కరరావు, బి.సీతయ్య, బి.అనంతం, బి.ఎర్రయ్య, ఆర్.రవి, ఎం.పాపారావు వాయిద్య సహకారం అందిస్తున్నారు. ఆసక్తి గల భజన బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం మేడూరి వేంకట సత్యజయకృష్ణశర్మ (నానిబాబు) అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 11న మధ్యాహ్నం భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని శ్రీరామలింగేశ్వర భజన బృందం, ధర్మవరం గ్రామపెద్దలు, యువజన సంఘ ప్రతినిధులు తెలిపారు.

# మిల్లర్స్ అసోసియేషన్ ట్రెజరర్‌గా చైతన్యప్రభు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ట్రెజరర్‌గా అంధవరపు చైతన్యప్రభు నియమితులయ్యారు. ఈమేరకు అసోసియేషన్ అధ్యక్షుడు బోయిన రమేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. చైతన్య ప్రభు చెన్నైలోని ఎంజీ రామచంద్రన్ విశ్వవిద్యాలయం నుంచి బీటెక్ పట్టా పుచ్చుకున్నారు. జేఎన్‌టీయూ కాకినాడ అనుబంధ కళాశాలలో ఎంటెక్‌తో పాటు ఎంబీఏ పూర్తి చేశారు. ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో పదేళ్లు లెక్చరర్‌గా, ఎగ్జామ్ సెల్ ఇన్‌ఛార్జిగా పని చేసి ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. తర్వాత వ్యాపార రంగంలో అడుగుపెట్టి రైస్‌మిల్‌తో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. చైతన్యప్రభు కుటుంబం దాదాపు ఐదు దశాబ్దాలుగా రైస్‌మిల్ వ్యాపారంలో కొనసాగుతోంది. ఆయన తాత అంధవరపు వెంకటముత్యాలు 1977లో రైస్‌మిల్ స్థాపించారు. ఆ సమయానికి శ్రీకాకుళం, పరిసర ప్రాంతాల్లో మరో రైస్‌మిల్లు లేదు. ముత్యాలు తర్వాత ఆయన కుమారుడు ఉమాశంకర్ రైస్‌మిల్ వ్యవహారాలు పర్యవేక్షించేవారు. దశాబ్దం క్రితం ఆ వ్యాపారాన్ని ఉమాశంకర్ రెండో తనయుడు చైతన్య ప్రభు నిర్వర్తించడం ప్రారంభించారు. తనకు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ట్రెజరర్ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు బోయిన రమేష్, అందుకు సహకరించిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడులకు ధన్యవాదాలు తెలిపారు.










# ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**- అధికారులకు ఫోన్లో ఆదేశించిన ఎమ్మెల్యే బగ్గు -**



**(సత్యంన్యూస్, నరసన్నపేట)**

ప్రజా దర్బార్‌కు వచ్చిన సమస్యలు తక్షణమే పరిష్కరించదాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. శనివారం కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలు స్వీకరించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు, అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి, రేషన్ కార్డులు, పింఛన్లు, వ్యక్తిగత ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలు గాలికి విడిచిపెట్టడంతో ఎక్కడ వేసిన గొంగళి మాదిరిగా అక్కడే ఉన్నాయని, సమస్యలు కుప్పలు తెప్పలుగా పెరిగిపోవడంతో, ప్రభుత్వం మాడడంతో స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు వచ్చి అనేక సమస్యలపై ఫిర్యాదులు ఇస్తున్నారని తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.